•

# వసతి

"సిస్టర్స్ లేరని అనుకోకు తమ్ముడూ! నేనున్నాను. ఆడపడుచు పెత్తనానికీ, లాంఛనాలకు, మర్యాదలు జరిపించుకునేందుకు!" అంది శ్యామల చనువుగా.

"నా తల్లే! ఎంత చల్లని కబురు చెప్పేవు!" అన్నారు అన్నపూర్ణమ్మగారు చిన్న కోడలు వేపు చూసి నవ్వుతూ.

'మరే! తోటి కోడలు తోడుండొద్దా?' అన్నాడు జనార్ధన్.


'ఎలా కుదుర్తుంది బావగారూ! అక్క యింటికి పెద్ద కోడలు కదా! అందువల్ల ఆడపెళ్లివారి తరఫునే వుండనీయండి' అంది.

'పల్లె సీమలు స్వచ్ఛమైన గాలి, నీరు, వెలుతురు ప్రకృతి అందాలకు నిలయాలు మాత్రమే కాదు. అప్యాయత, అభిమానం, అనురాగం. ప్రేమ, దయాగుణాలకు పల్లెవాసులు పట్టుకొమ్మలు' అనుకున్నాడు రాజశేఖర్

రాజశేఖర్‌ది చక్కటి పర్సనాల్టీ. కంప్యూటర్స్ ఇంజనీర్.

హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాడు. అతనికి తల్లీతండ్రీ తోబుట్టువులు లేరు. వైజాగ్‌లో పెద్ద యిల్లు వుంది. తండ్రి మిగిల్చిన డబ్బుతో చదువుసాగించేడు. చదువు ముగియగానే జాబ్ వచ్చింది. ఎప్పుడూ ఒంటరితనంతో సతమతమవుతున్న అతనికి వారి అప్యాయత, అభిమానం పన్నీరు జల్లులా వుంది. జనార్ధన్, రాజశేఖర్ కజిన్ నందకిషోర్ క్లాస్‌మేట్స్. యిద్దరూ మంచి స్నేహితులు. నందకిషోర్ ద్వారా యీ సంబంధం వచ్చింది. అతని బలవంతం వల్లే యీ పెళ్ళి చూపులకు వచ్చేడు రాజశేఖర్.

మంజుల మంచి అందకత్తె. టెన్త్‌పాసైంది. శివరామశర్మ గారికి యిద్దరు కొడుకుల తరువాత అపురూపంగా పుట్టిన ఆడపిల్ల.



శివరామశర్మ గారికి రాయవరంలో ఏభై ఎకరాల మాగాణిపొలం, పది ఎకరాల మామిడి. కొబ్బరి తోటలున్నాయి. నాలుగు ఎకరాల్లో కాయకూరలు, వాణిజ్య పంటలూ పండిస్తున్నారు. నీటి సదుపాయం వుంది. గ్రామంలో అర ఎకరం స్థలంలో పాత కాలపు పెద్ద మండువా ఇల్లు వుంది. ఆ యింటికి అధునిక సదుపాయాలు సమకూర్చేరు. ఆరు జతల వ్యవసాయ పశువులు, నాలుగు పాడి ఆవులున్నాయి. ఆయన పెద్ద కొడుకు జనార్దన్, రెండోవాడు శంకర్. ఇద్దరూ ఎగ్రికల్చర్ బిఎస్సీ చదివి చక్కగా వ్యవసాయం చూసుకుంటూ తండ్రికి విశ్రాంతినిచ్చేరు. ఇద్దరికీ మేనరికాలు చేసారు.

పెద్దకోడలు శారద. రెండో కోడలు శ్యామల. ఇద్దరు కోడళ్లూ అత్త మామలను ఎంతో అభిమానంతో చూస్తూ వారికి సేవ చేస్తున్నారు.

శివరామశర్మ గారి బావమరుదులిద్దరూ వారి భార్యలను వెంటబెట్టుకుని వచ్చేరు.

"వీరు మా పెద్దబావమరిది రామ్మూర్తిగారు ఆవిడ జానకమ్మ గారు మా పెద్ద కోడలు శారద తల్లిదండ్రులు, వారు లక్ష్మణమూర్తిగారు ఆవిడ అనసూయమ్మ గారు మా చిన్న కోడలు శ్యామల తల్లిదండ్రులు. వారుండేది ప్రక్క గ్రామంలోనే మైలుదూరం. వారికీ ఏభై ఎకరాల మాగాణీ వుంది" అని శివరామశర్మ వచ్చిన వారిని రాజశేఖర్‌కి పరిచయం చేశారు.

"చిన్న మావయ్యా! మా మరదలు శ్యామల కట్న కానుకలు లాంఛనాలు అందుకోవచ్చుని తను ఆడపడుచునని డిక్లేర్ చేసుకుంది! మరి నీ సంగతేంటి?" అన్నాడు జనార్ధన్ నవ్వుతూ.

'అట్లాగైతే మా అమ్మాయి నాకు వియ్యం కుడి హోదా కల్పించిందన్నమాటే కదా! యిక కాసుకోండి!' అన్నారు లక్ష్మణమూర్తి మందహాసంతో.

పెళ్ళి కూతుర్ని తీసుకుని వచ్చి కూర్చోబెట్టిన రెండు నిముషాలకు 'ఎంతసేపు యిద్దరూ అలా మౌనంగా కూర్చుంటారు. తమ్ముడూ అమ్మాయిని ఏవైనా అడుగు' అంది శ్యామల.

రాజశేఖర్ కాస్త తటపటాయించేడు.

'సరే మా తమ్ముడు మొహమాటపడుతున్నాడు! నేనే అడుగుతా నీ పేరేంటమ్మాయి?' అంది శ్యామల.

'మంజుల' అంది నెమ్మదిగా.

'కాస్త బిగ్గరగా చెప్పమ్మా! రాలిన ముత్యాలు ఏరడానికి అన్నదమ్ములిద్దరూ రడీగానే వున్నారు భయం లేదు... ఏం చదివేవు?'

'టెన్త్'

'వంట చెయ్యగలవా?'

'గలను'

'సంగీతం క్లాసికల్, లైట్ మ్యూజిక్'

'రాదు'

'పోనీ పల్లె పదాలు, జోల పాటలు ఏవీ రావా... ఏం సోద్యం! రేపు బిడ్డను తొట్టెలో వేస్తే...'

'చాల్లే యిక నీ వాగుడు ఆపు! బావుండదు!' అని కూతుర్ని మందలించ బోయింది అనసూయమ్మ.

'పర్వాలేదమ్మా! యిదో వేడుక! మనం పిల్లల సదాలకు అడ్డుపడకూడదు! మనం వారితో ఎంజాయ్ చెయ్యాలి!' అన్నారు శివరామశర్మగారు నవ్వుతూ.

'మా అబ్బాయిని ఏవైనా అడగాలనుకుంటే అడుగు' అన్నారు లక్ష్మణ మూర్తిగారు.

'అడగడానికేముంది! మా తమ్ముడి వివరాలన్నీ యీ వరకే అన్నదమ్ములిద్దరూ చెల్లెలి చెవిలో శంఖం ఊదినట్లు చెప్పేరు' అంది శ్యామల.

ఇరువురూ ఒకర్నొకరు యిష్టపడ్డారని విని పెద్దలందరూ సంతోషించేరు.

'బావగారూ! యిక మిగిలిన విషయాలు కూడ మాట్లాడేసుకుంటే ముహూర్తం నిర్ణయించుకోవచ్చు' అన్నారు లక్ష్మణమూర్తి గారు వియ్యకుండి హోదా ప్రదర్శిస్తూ.

'అబ్బే నాకు అటువంటి...' అంటూ ఏమో చెప్పబోయేడు రాజశేఖర్.

'నువ్వూరుకో-తమ్ముడూ! నాన్నగారికి అంతా తెలుసులే' అంది శ్యామల. 'బావగార్ని ఆటపట్టిస్తున్నారంతే' అని మెల్లగా చెప్పింది.

శివరామశర్మ గారు చిరునవ్వు నవ్వి పెద్ద కొడుకు వేపు చూశేరు.

'దాందేం వుంది మావయ్యా! మీ అన్నదమ్ములిద్దరూ మీ అమ్మాయిలకు ఎలా జరిపించారో మేమూ మా చెల్లెలుకి అలాగే జరిపిస్తాము' అన్నాడు జనార్దన్ హుందాగా.

'అల్లాగైతే మీరు కనీసం ఒక ఏడాదైనా ఆగాల్సి వుంటుంది మీ చెల్లెలి పెళ్లి ముహూర్తానికి' అంది శ్యామల.

'ఈ లిటిగేషన్ ఏంటి?' అన్నాడు జనార్దన్ విస్మయంగా.

'అదంతే బావగారూ! మా నాన్నగారూ, పెదనాన్నగారూ కన్యాదానాలు 40 కేజీల బంగారంతో చేసేరు. మీ బంగారం ప్రస్తుతం బరువు 38 కేజీలే!' అంది.

ఆమె మాటలు ముందు అర్థం కాక ఆశ్చర్యపడి తరువాత అర్థం చేసుకుని అందరూ బిగ్గరగా నవ్వేరు.

'పో వదినా!' అంది మంజుల ఎరుపెక్కిన బుగ్గలతో.

'నేనింకా ప్రొబేషన్‌లో వున్నాను. లీవ్ మూడు, నాలుగు రోజుల కన్నా ఎక్కువ దొరకదు' అని చెప్పేడు రాజశేఖర్.

'అతనికి అనుకూలంగా వుండేవిధంగా ముహూర్తం నిర్ణయించేరు శివరామశర్మగారు.

'బాబూ! నాదో చిన్న రిక్వెస్ట్! నిన్ను పెళ్లి కొడుకుని చెయ్యడం వేడుక మాయింట జరిపిద్దామనుకుంటున్నాం. అక్కడ నుండి అందరం పెళ్లికి తరలివద్దాం! మాకు మొగ పిల్లలు లేరనే లోటు తీరుతుంది' అన్నారు లక్ష్మణమూర్తి గారు.

వారి ఆప్యాయతకు రాజశేఖర్ చలించిపోయేడు.

'తప్పకుండా బాబాయిగారూ! అంతేకాదు మన సైడున కావల్సిన ఏర్పాట్లన్నీ మీరే చూడాలి! మనీ ఎంత అవసరమో..'

'మనీ గురించి నువ్వేమీ వర్రీ అవకు! ఏర్పాట్లన్నీ నేను చేస్తాను కదా!' ఎంతో ఆనందంగా అన్నారు లక్ష్మణమూర్తిగారు.

రాజశేఖర్‌వారి కోరిక మేరకు అక్కడ నుండి నేరుగా వారింటికి వెళ్లాడు. వారిది ఉమ్మడి కుటుంబం! అన్నదమ్ములిద్దరూ కలిసే వుంటున్నారు. వారిదీ పెద్ద మండువాయిల్లే. రామ్మూర్తిగారు సమితి ప్రసిడెంట్. ఆయనకు గొప్ప పలుకుబడి వుంది.

వెడ్డింగ్ కార్డులు రాజశేఖర్ తన అభిమాన పుత్రుడని వేయించేరు లక్ష్మణమూర్తి గారు.

రాజశేఖర్ జాబ్ కన్ఫర్మ్ అయింది. సతిని తీసుకురావడానికి హైదరాబాద్‌లో వసతి కుదర్లేదు. మంజుల ప్రతి ఉత్తరంలోనూ యింటి విషయం గుర్తు చేస్తోంది. చెల్లెలి కాపురానికి అవసరమైన సామాగ్రి ఒక లారీ లోడ్ సమకూర్చి పెట్టేరు అన్నదమ్ములు. ఆడవారంతా హైదరాబాద్ చూడాలని ఉబలాటపడుతున్నారు.

వసతి కుదరగానే వారందరినీ హైదరాబాద్ తీసుకొచ్చి వారికి సాలార్ జంగ్ మ్యూజియం, రామోజీ ఫిల్మ్‌సిటీ, చార్మినార్, గోల్కొండ ఫోర్ట్, వగైరా చూపిస్తానని

రాజశేఖర్ ప్రామిస్ చేసాడు. అయితే అతను, అతని ఆఫీస్ కొలీగ్స్ ఎంత ప్రయత్నిస్తున్నా మంచి యిల్లు అద్దెకు కుదరలేదు.

రామ్మూర్తిగారు హైదరాబాద్ సమితి పనిమీద వెళ్తూ జనార్దన్‌ని కూడా వెంట తీసుకొని వెళ్లేరు. రాజశేఖర్ ఆఫీసుకు రెండు కిలోమీటర్ల దూరంలో కొత్తగా నిర్మిస్తున్న ఫ్లాట్స్ చూసేరు. అవి వారం రోజుల్లో పూర్తవుతాయి. వాటి వివరాలు సేకరించేరు. రెండు బెడ్‌రూమ్స్, ఒక డ్రాయింగ్ రూమ్, కిచెన్, ముందూ వెనకా బాల్కనీలు, ఎటాచ్డ్ బాత్ ఫ్లాట్ నమూనా ఫోటోలు తెచ్చి అందరికీ చూపించాడు జనార్దన్.

'హైదరాబాద్‌లో అద్దె యింట్లో యిబ్బందిపడే కంటే సొంత యిల్లుండడం మంచిదని, క్రొత్త యింట్లో పాలు పొంగించి క్రొత్త కాపరం పెట్టడం మేలు' అని పెద్దలందరూ నిర్ణయించేరు.

'అయితే రాజశేఖర్‌కి యీ విషయం ముందుగా చెప్తే అతడంగీకరించడు. అతను అసలే మొహమాటస్తుడు! అందుకని యిల్లు మంజుల పేర తీసుకుంటే అతను కాదనలేడు' అనుకుని అన్నదమ్ములిద్దరూ బేంక్ డ్రాఫ్ట్ తీసుకుని హైదరాబాద్ వెళ్ళి ఫ్లాట్ చెల్లెలిపేర కొన్నారు. ఈ శుభవార్త రాజశేఖర్‌కి చెప్పాలని ఎంతో సంతోషంతో అతని ఆఫీస్‌కి వెళ్ళేరు.

బావమరుదులిద్దరూ సడన్‌గా ప్రత్యక్షమవడంతో రాజశేఖర్ ఆశ్చర్యపడి వారిని సాదరంగా రిసీవ్ చేసుకుని

'మీకో గుడ్ న్యూస్! నాకు ప్రమోషన్‌మీద వైజాగ్ ట్రాన్స్‌ఫరైంది! యిప్పుడే ఆర్డర్ తీసుకున్నాను. రిలీవింగ్ ఆర్డర్‌కూడా కలెక్ట్‌చేసుకున్నా. రేపే వైజాగ్‌లో జాయిన్ అవాలి! వైజాగ్‌లో సొంత యిల్లుంది కనుక వసతి ప్రాబ్లమ్ లేదు! అన్నిటికంటే ముఖ్యమైన విషయం అందరికీ దగ్గరగా వుండొచ్చు కదా!' అని ఎంతో సంతోషంతో అన్న అతని మాటలకు అవాక్కయ్యేరు అన్నదమ్ములు ఇద్దరూ.

**('ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక', 24 ఫిబ్రవరి 2001)** ✪